క్లుప్తంగా

మొక్కల పెంపకానికి శ్రీకారం



మొక్కలు నాటుతున్న సత్యసాయి మహిళా ప్రతినిధులు

ఉక్కునగరం: సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా విశ్వ వ్యాప్తంగా ప్రేమ తరు పేరిట కోటి మొక్కల నాటు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ సమీప ఏఎంటీజెడ్ ప్రాంగణంలో 163 మామిడి, జామ, సపోటా, ఉసిరి, నిమ్మల, నేరేడు, దానిమ్మ, బొప్పాయి, కొబ్బరి తదితర మొక్కలు నాటారు. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.ఎన్.నాయుడు, జిల్లా సేవా విభాగం సమన్వయకర్త ఆర్.ఎ.నాయుడు, ఉక్కునగరం సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, ఏఎంటీజెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: సుమారు 53 ఏళ్ల కిందట పదో తరగతి చదువుకున్న విద్యార్థులు స్నేహితుల దినోత్సవం రోజున సందడి చేశారు. సింధియాలోని గాంధీ గ్రాం హైస్కూల్‌లో 1970–71 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గాజువాకలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సుమారు 80 మంది ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గత 53 ఏళ్లలో మృతి చెందిన తమ మిత్రులకు తొలుత నివాళులర్పించిన అనంతరం కార్యక్రమాలను కొనసాగించారు. వివిధ దేశాలు, పలు ప్రాంతాల్లో ఉన్న స్నేహితుల స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ఆహ్వాన కమిటీ కన్వీనర్ మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్నేహ బంధం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తనకు ఇంతమంది స్నేహితులు లభించడం చాలా గర్వంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పీబీకే ఆనంద్, బి.సంజీవరావు, బి.తులసీరావు, కె.రామకృష్ణ, కాండ్రేగుల త్రినాథ్, బి.వెంకటేశ్వరరావు, మల్ల అన్నపూర్ణ, జయ, కె.వరలక్ష్మి, జి.టి.ప్రసాద్ పాల్గొన్నారు.

హార్బర్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

జగదాంబ: హార్బర్ పోలీసు స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది ప్రజలతో మమేకం కావాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన వారిని కూర్చోబెట్టి మాట్లాడాలన్నారు. స్టేషన్‌ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలన్నారు. రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. సిబ్బందికి కుటుంబం, ఉద్యోగపరంగా సమస్య ఉంటే వెంటనే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. క్రైం పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు శిథిలం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సొంతింటి కల సాకారమెప్పుడు?

- టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల భారీ ర్యాలీ
- తక్షణం పంపిణీ చేయాలని ఆందోళన



64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్‌తో మాట్లాడుతున్న లబ్ధిదారులు



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

పెదగంట్యాడ: సొంతింటి కలను నిజం చేయాలని టిడ్కో లబ్ధిదారులు కదం తొక్కారు. తక్షణం ఇళ్లు కేటాయించాలని లబ్ధిదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు భానోజీతోట, దయాల్‌నగర్ వద్ద నిర్మించిన ఇళ్ల వద్ద ధర్నా చేశారు. టిడ్కో ఇళ్ల కోసం ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నామని, ఇళ్లు కేటాయించకపోయినా బ్యాంక్ రుణాలు కట్టాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఇంటి అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే.. మరో పక్క బ్యాంక్ రుణాలు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భానోజీతోట, దయాల్‌నగర్, దువ్వాడ తదితర ప్రాంతాల్లో 2017లో నిర్మించిన ఇళ్లు తమకు మంజూరయ్యాయని, అప్పట్లో రూ.25వేలు వంతున డీడీలు చెల్లించామని, అయితే ఇంత వరకూ ఇళ్లను కేటాయించకపోవడం దారుణమన్నారు. ధర్నా అనంతరం బీసీ రోడ్డు మీదుగా పెదగంట్యాడ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా గృహ సముదాయాలకు రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో కుటుంబాలతో గృహ ప్రవేశాలు చేస్తామని హెచ్చరించారు. స్పందించిన కార్పొరేటర్.. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు.

8 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం..



దయాల్‌నగర్‌లో 2017లో టిడ్కో ఇల్లు మంజూరైంది. దీంతో నా సొంతింటి కల సాకారమైందని సంబర పడ్డాను. అద్దె బాధ తప్పుతుందని భావించి, భారమైనా బ్యాంక్ రుణం తీసుకున్నాను. అప్పట్లో అప్పు చేసి రూ.లక్ష డీడీ తీసి జీవీఎంసీ అధికారులకు ఇచ్చాను. ఎనిమిదేళ్లుగా నా ఇంటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నాను. కొత్త ప్రభుత్వం స్పందించి ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి.

– విశ్వనాథ రామలక్ష్మి, భానోజీతోట

రూ.లక్ష డీడీ కట్టాను..



సొంతింటి కోసం 2017లో రూ.లక్షతో డీడీ తీశాను. నాకు భానోజీతోటలో టిడ్కో ఇల్లు మంజూరైంది. ఏళ్లు గడుస్తున్నా ఇంటిని అప్పగించడం లేదు. ఎన్నాళ్లని ఎదురు చూస్తాం. మా పరిస్థితి ఎవరికీ అర్థం కావడం లేదు. ఏళ్లకు ఏళ్లు అద్దె ఇళ్లలోనే మగ్గిపోతున్నాం. ఒక పక్క అద్దె బాధలు.. మరో పక్క బ్యాంక్ రుణాల ఒత్తిడితో మానసిన వేదనకు గురవుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలి.

–పేర్ల పార్వతి, అక్కిరెడ్డిపాలెం

బ్యాంకుల నుంచి ఒత్తిడి..



టిడ్కో ఇంటి కోసం బ్యాంక్ రుణం తీసుకున్నాం. అప్పట్లో రూ.50 వేలు డీడీ చెల్లించాం. ఇంత వరకూ ఇంటిని మాకు అప్పగించలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు దాటినా ఇంత వరకూ టిడ్కో ఇళ్ల గురించి మాట్లాడ లేదు. బ్యాంకుల నుంచి రుణం చెల్లించాంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఇల్లు రాక బాధపడుతుంటే బ్యాంక్‌ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ వల్ల మానసిక ఒత్తిడికి లోనవుతున్నాం. ప్రభుత్వం స్పందించాలి.

– వెంకటలక్ష్మి, శ్రీనగర్

అల్యూమినియం సెంటర్‌లో నగదు చోరీ



అల్యూమినియం షాపు వద్ద విచారణ చేస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: అల్యూమినియం షాపునకు తాళం వేసి భోజనానికి వెళ్లిన యజమాని తిరిగి వచ్చి చూసే సరికి క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదు చోరీకి గురైంది. గాజువాక సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా.. గాజువాక కణితి రోడ్డులో సింహాద్రి అల్యూమినియం సెంటర్ ఉంది. ఆదివారం షాపునకు ఒక వ్యక్తి వచ్చి పని కావాలని అడిగాడు. సెంటర్ యజమాని గోపికృష్ణ పనిఏమీ లేదని చెబుతూ మధ్యాహ్నం కావడంతో షాపు షెట్టర్ దించి తాళం వేసి పక్కనే ఉన్న ఎలక్ట్రిక్ మీటర్ బోర్డుపై దానిని ఉంచి భోజనానికి వెళ్లాడు. యజమాని తిరిగి వచ్చి బోర్డుపై తాళాలను తీసి షాపు కొనసాగించాడు. కొద్ది సేపటి తర్వాత యజమాని క్యాష్ కౌంటర్‌ను చూడగా అందులో ఉండవల్సి రూ.60 వేల నగదు కనిపించలేదు. యజమాని నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించగా.. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ కె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. అక్కడే ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఒక వ్యక్తి షట్టర్ ఎత్తి తిరిగి షట్టర్ దించి పరిగెత్తుతూ ఉన్న దృశ్యాలను పరిశీలించారు. సెంటర్ యజమాని గోపికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నారు.

‘అన్ని రంగాల్లో మహిళల రాణింపు’



మహిళల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో సునీత



పరుగు పందెంలో పాల్గొంటున్న యువతులు

అగనంపూడి: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని గాజువాక మండల విద్యాశాఖాధికారి ఎం.సునీత అన్నారు. అగనంపూడి వాకర్స్ క్లబ్, వనితా క్లబ్‌ల సారథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆటల పోటీలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడల్లో మహిళలు పాల్గొని సత్తా చాటుతున్నారని, మహిళలు ఏ రంగంలోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారన్నారు. వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.ఇందిరాదేవి, ఆర్.శశికళ మాట్లాడుతూ అగనంపూడి వాకర్స్ క్లబ్ అభివృద్ధిలో మహిళామణుల పాత్ర చాలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.నరసింగరావు, సీడబ్ల్యూసీ కార్యదర్శి కరణం పైడిరాజు, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, చిన్ని పూర్ణ, వెంకటాద్రి, కె.వి.నాయుడు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ సమస్యల పరిష్కారానికి సంజీవరావు ఎనలేని కృషి



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఏసీపీ త్రినాథ్, జీఎంలు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారంలో హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు కీలక పాత్ర పోషించారని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ చేసిన హెచ్‌ఆర్ జీఎం కంచర్ల సంజీవరావును సీ భవన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఏసీపీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పారిశ్రామిక సంబంధాలు మెరుగుకు సంజీవరావు ఎనలేని కృషి చేశారన్నారు. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు సంజీవరావు సంధానకర్తగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపేవారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ తమ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్‌ల బైలాస్ తయారు చేయడంతోపాటు సంఘాలను విజయవంతంగా ముందుకు నడిపించడంలో సంజీవరావు ముఖ్య భూమిక వహించారన్నారు. ముందుగా మహనీయులు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, బిర్సా ముండా చిత్రపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్ జీఎంలు ఎస్. భాను, ఎం.మధుసూదనరావు, ఠాగూర్, జయకుమార్, డాక్టర్ నాగరాజు, వివిధ సంఘాల నాయకులు కె.వి.డి.ప్రసాద్, మాటూరి శ్రీనివాసరావు, పరమట సత్యనారాయణ, జి.బోసుబాబు, ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అపురూపం స్నేహబంధం



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు



టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. అందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పల్లా చినతల్లి, రాజాన వెంకటరావు, ఆండిబోయిన అప్పారావు, సంపంగి ఈశ్వరరావు, నక్క వెంకటరమణ, పిట్టా రెడ్డి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డ గోవింద్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా వారంతా స్కూల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఒక చోట చేరారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిరిశెట్టి వెంకట శివ అప్పారావు, పిట్టా పైడిరెడ్డి, గొందేశి తాతారావు, బలివాడ శ్రీను, మొల్లి వెంకట రమణ, పెదపూడి వాసు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్‌షిప్ డే బ్యాండ్లు కట్టుకుంటున్న చిన్నారులు

◆ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కులుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నడుపూరులోని వాసవీ జ్ఞాన మందిరంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: స్నేహ బంధానికి మతాలు అడ్డు లేకుండా ఆదివారం ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా నిర్వహించుకున్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం చిన్నారి సయ్యద్ జాహిద్ హుస్సేన్ తన స్నేహితుడు బాలాజీకి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి స్నేహ బంధం గొప్పదని చూపాడు.

ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు దీపిక



బాక్సింగ్ కోచ్ శ్రీనివాసరావుతో క్రీడాకారిణి దీపిక

ఉక్కునగరం: ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు స్టీల్‌ప్లాంట్ విద్యార్థిని కనక దీపిక ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు అబుదాబీ లోని ఎ1 ఏఈఎస్ సిటీలో ఏఎస్‌బీసీ ఆసియన్ జూనియర్ బాలురు, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత కోసం బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 11 వరకు రోహతక్‌లోని సాయ్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జాతీయ డీఏవీ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం, సీబీఎస్ఈ సౌత్ జోన్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన కనక దీపికను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో దీపికను స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ కోచ్ కె. శ్రీనివాసరావు అభినందించారు. దీపిక తండ్రి కె. వెంకటరామారావు స్టీల్‌ప్లాంట్‌లో చార్జిమెన్ కాగా తల్లి భవాని న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు.

‘ఉదయ కిరణాలు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాబివర్ధన్

సీతంపేట: రచయిత డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి ఆటవెలదిలో అద్భుతమైన పదజాలంతో రచించిన ఉదయ కిరణాలు శతకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని ఏయూ జర్నలిజం పూర్వ విభాగాధిపతి ఆచార్య పి.బాబివర్ధన్ అన్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భాషను, భావాన్ని సమన్వయం చేసుకుంటూ, సమాజాన్ని, మానవీయ కోణాన్ని తన రచనలో ఆవిష్కరించారన్నారు. సుమతీ శతకం, వేమన శతకంలా శశిభూషణ స్వామి రాసిన ఉదయకిరణాలు శతకం మంచి పేరును సంపాదిస్తుందని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్ట్ నాగబోయిన నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. సమాజంలోని ప్రతి అంశాన్ని తీసుకుని పద్య రూపంలో పొందుపర్చారన్నారు. పుస్తక రచయిత శశిభూషణ స్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో సమాజానికి ఏదైనా చెయ్యాలన్న ఆలోచన శతక పద్యాలను రాసేలా చేసిందన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ జి.రాజేశ్వరరావు, రచయిత పి.చంద్రభూషణం, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: అమరపిని యాస్పెంట్ షాటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 9 రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర షాటో కాన్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా తెలంగాణకు చెందిన డ్రాగన్ షాటో కాన్ కరాటే డూ స్పోర్ట్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది.

విజేతలకు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులు అందజేశారు. పోటీలను గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రారంభించారు. అమరపిన్ని నరేంద్ర, అమరపిన్ని మనోహర్ సాయి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు.

‘ఉక్కు’ను విక్రయిస్తే ప్రతిఘటన తప్పదు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

అగనంపూడి : తెలుగు రాష్ట్రాల ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తే పెద్ద ఎత్తున ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తుల్లో కీలుబొమ్మగా మారిన కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ధరకు అప్పగించాలని చూస్తుందని, ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామన్నారు. మూడేళ్లకు పైగా ఉద్యోగులు, ప్రజా సంఘాలు ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలని శాంతియుత నిరసనా కార్యక్రమాలు చేపడుతుంటే పట్టనట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామని ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. 1270వ రోజు దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్మథరావు, జె.అచ్యుతరావు, నాయకులు కొండలరావు, కసిరెడ్డి సత్యనారాయణ, మసేనురావు, జె.రామకృష్ణ, రెహమాన్, రాజబాబు, నరసింగరావు, మంత్రి రవి, మంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

గీతం ఆస్పత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సురేష్ భార్య ఝాన్సీ, కుటుంబ సభ్యులు

కొమ్మాది: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ ఓ మహిళ గీతం ఆస్పత్రిలో ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్ (37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉందని ఎక్కించారని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ ఝాన్సీ ఆరోపిస్తున్నారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని, ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావిడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోతాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లమని ఆదోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం ఎంపిక

డాబాగార్డెన్స్: విశాఖ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని రెడ్నంగార్డెన్స్‌లో గల ఓ హోటల్లో నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీవీ ఆర్ నాయుడు (గణబాబు) పాల్గొని నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరం సేవలను కొనియాడారు. నాగార్జున విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ ఫోరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఫోరం నాయకుడు, విద్యార్థి వెంకట్రావు మాట్లాడుతూ ఫోరం ప్రారంభించి 13 ఏళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఫోరం గౌరవ అధ్యక్షుడిగా పి. వెంకట్రావు, అధ్యక్షుడిగా పీఎస్ తిలక్, ఉపాధ్యక్షుడిగా కె. సత్యనారాయణ, కార్యదర్శిగా పి. రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా బి. సీతారామయ్య, కోశాధికారిగా పి.రాము తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

బ్రాహ్మిణ్ వ్యాపారులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న చెరువు రామకోటయ్య

సీతంపేట: బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు పరస్పర సహకారం అందజేయడం, యువ బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు మెరుగైన సలహాలు, సూచనలు అందించి వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మిణ్ పనిచేస్తోందని సంస్థ గౌరవ అధ్యక్షుడు చెరువు రామకోటయ్య తెలిపారు. శంకరమఠంలో ఆదివారం జరిగిన బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖ చాప్టర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో నిబద్ధత, నిజాయితీగా వ్యాపారం చేసి అందరి మన్ననలు పొందాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, బ్రాహ్మణ చిరు వ్యాపారులకు బిజినెస్ బై బ్రాహ్మిణ్ అండగా నిలుస్తుందన్నారు. వ్యాపారానికి కావలసిన మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు, వ్యాపారాభివృద్ధిపై సమగ్ర అవగాహన కల్పించి సహాయం అందిస్తామని చెప్పారు. సంస్థ ప్రెసిడెంట్ ధవళ మధుసూదనరావు, సెక్రటరీ పరిమి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొని తమ వ్యాపార వివరాలు వెల్లడించారు.